క్లుప్తంగా

కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలి

జూలూరుపాడు: కార్మికవర్గానికి కనీస వేతన చట్టం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్కే సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. జూలూరుపాడులో సోమవారం జరిగిన ఏఐటీయూసీ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమాన్ని విస్మరించారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే చట్టాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంచర్ల జమలయ్య, ప్రసాద్ మాట్లాడారు. ఎర్ర బాబు, చంద్ర నరేంద్రకుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, గోనె మణి, భూక్యా లలిత, పార్వతి పాల్గొన్నారు.

విషజ్వరాలపై పట్టింపేది?

ఇల్లెందు: నియోజకవర్గంలో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు ఆరోపించారు. ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల ఎదుట ఆయా సంఘాల ఆధ్వర్యాన సోమవారం నిరసన తెలిపి డాక్టర్ రాంనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మోతీలాల్, చింతా నర్సింహారావు, రవి, ముస్తఫా, రాజేశ్, రజిత, సుభద్ర, కోటమ్మ, సరోజని మాట్లాడుతూ.. టైఫాయిడ్, మలేరియా, డెంగీ లాంటి విషజ్వరాలతో ప్రజలు బాధపడుతుండగా ఆస్పత్రిలో సదుపాయాలు లేక మెరుగైన సేవలందడం లేదని విమర్శించారు. లాజర్, రమేశ్, సతీశ్, మంగలత, సమ్మక్క, మంగ, సర్వేంద్ర, గాంధీ పాల్గొన్నారు.

జగ్గుతండాలో వైద్యశిబిరం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని మైలారం పరిధి జగ్గుతండాలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి స్వప్న ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించారు. వైద్యాధికారి మాట్లాడుతూ.. వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హరికృష్ణ, శివప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చల్లసముద్రంలో లింగన్న వర్ధంతి

ఇల్లెందురూరల్: మండలంలోని చల్లసముద్రం గ్రామ పంచాయతీ కేంద్రంలో న్యూడెమోక్రసీ అజ్ఞాత దళ నాయకుడు పూనెం లింగన్న వర్ధంతిని సోమవారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్డీ నేత నరాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం అజ్ఞాత దళ సభ్యుడిగా, కమాండర్‌గా పనిచేసిన లింగన్న పేదల సంక్షేమమే లక్ష్యంగా ఉద్యమించారని తెలిపారు. మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో ప్రజలను చైతన్యపర్చి పోడు భూములను పంపిణీ చేశారని చెప్పారు. దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్మించి నిలువరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి అనిల్‌రెడ్డి, కల్తీ సుభద్ర, గురుస్వామి, అన్నాబత్తుల వెంకన్న, దొంతు లక్ష్మయ్య, సైదులు, రాము, తొండల సర్వయ్య, అయిలు ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగన్న ఆశయసాధనకు కృషి

జూలూరుపాడు: సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు లింగన్న ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్కే ఉమర్ పిలుపునిచ్చారు. మండలంలోని భేతాళపాడు, గుండెపుడిల్లో సోమవారం నిర్వహించిన లింగన్న వర్ధంతి సభల్లో ఆయన మాట్లాడారు. భూమి, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం రహస్య జీవితాన్ని గడుపుతూ పోరాడిన లింగన్నను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నాయకులు బత్తుల గోపి, కుంచం కృష్ణ, జమలయ్య, శంకరయ్య, ఈసాల ఎర్రయ్య, రాజు, ఏనుగు సాయికుమార్, విమలమ్మ, ఈసాల మారుతమ్మ, పుల్లమ్మ, ఇందిర పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యత

ఇల్లెందురూరల్: మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా సోమవారం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీఏసీఎస్ నూతన భవన నిర్మాణం తుదిదశకు చేరుకుందని, త్వరలో ప్రారంభించనున్నారని తెలిపారు. కార్యదర్శి గజేంద్రుల హరిప్రసాద్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముర్రేడు రెండో వంతెనతో ఇబ్బందులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని ముర్రేడు వాగుపై నిర్మించిన రెండో వంతెన వల్ల ప్రశాంత్‌నగర్, శ్రీనగర్ గ్రామ పంచాయతీల ప్రజలు, పాఠశాలలు, దేవాలయాలకు వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శ్రీనగర్ కాలనీ మాజీ ఉప సర్పంచ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ కొత్తగూడెం కార్యదర్శి లగడపాటి రమేశ్ తెలిపారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన కలెక్టర్ జితేశ్ వి పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కలెక్టర్ జాతీయ ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడి త్వరలో సర్వీస్ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

జీరో బిల్లు నిల్లు..

ఇల్లెందు ఒకటో వార్డుకు చెందిన వృద్ధురాలు చిర్రా ఆదిలక్ష్మి తనకు ఉచిత విద్యుత్‌కు జీరో బిల్లు రావడం లేదని ఇటీవల మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావును కలిసి గోడు వెళ్లబుచ్చుకుంది. చైర్మన్ సూచనలతో కంప్యూటర్ ఆపరేటర్ గణేశ్ పరిశీలించగా.. ఆదిలక్ష్మి దరఖాస్తులో ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసినా ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయాన పొందుపర్చలేదని తేలింది. అర్హుల నుంచి కొత్త దరఖాస్తులు స్వీకరిస్తున్నా పాత దరఖాస్తుల్లో ఎడిట్ ఆప్షన్ లేదని చెప్పడంతో వృద్ధురాలు ఉసూరుమంటూ వెనుతిరిగింది. ఆదిలక్ష్మి ఒకరే కాదు పలువురు ఇదే సమస్యతో ఆవేదన చెందుతున్నారు.



మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లుకు విన్నవిస్తున్న ఆదిలక్ష్మి

- ఇంకా పలువురికి అందని ఉచిత విద్యుత్
- దరఖాస్తుల్లో పొందుపర్చినా అమలుకాని పథకం
- ఆన్‌లైన్ నమోదులో పొరపాట్లే కారణమని గుర్తింపు
- దరఖాస్తుకు అవకాశం లేక ప్రదక్షిణలు

ఇల్లెందు: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ పథకాలు అందని లబ్ధిదారులు ఇల్లెందులో సుమారు 2 వేల మంది వరకు ఉంటారని అంచనా. అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. కానీ, మున్సిపల్‌కు వెళ్తే సిబ్బంది అలాంటి అవకాశం లేదని చెబుతున్నట్లు తెలిసింది. మరోపక్క దరఖాస్తుల్లో మీటర్ నంబర్ తదితర వివరాలు తప్పుగా నమోదైతే మాత్రం సరిచేస్తున్నారు. కానీ, పథకం అమలుకు దరఖాస్తు ఇచ్చినా ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే ఇప్పుడు చేసే అవకాశం లేదని తిప్పి పంపిస్తున్నట్లు సమాచారం.

పేదల ఇక్కట్లు

ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలనలోని ఆరు గ్యారంటీ పథకాలు అర్హులైన పేదలకు అందక ఇక్కట్లు పడుతున్నారు. సొంత ఇల్లు లేని పేదలు, కిరాయి ఇళ్లల్లో ఉంటూ ఖాళీ చేసి ఇల్లు మారిన వారు ఉచిత విద్యుత్ పరిస్థితి ఏమిటనే సందేహాలు తీర్చే వారు కరువయ్యారు. గ్యాస్, కరెంట్ పథకాలు పొందని వారు నాలుగు నెలలుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదిలాఉండగా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుకున్న వారు జీరో బిల్లు రాకపోయినా విద్యుత్ శాఖ అధికారులు అడగరని ప్రభుత్వ పెద్దలు చెబుతుండగా.. సిబ్బంది మాత్రం బిల్లు కట్టకపోతే కనెక్షన్ తొలగిస్తామని అంటున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇక రూ.500కు సిలిండర్ పథకం కోసం ఆధార్, బ్యాంక్ అకౌంట్ లింక్ చేసుకోవాలనే సూచనలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కాగా, ఇల్లెందు మున్సిపల్ పరిధి 24 వార్డుల్లో 9,415 గృహాలు ఉండగా ఐదు గ్యారంటీల కోసం 10,373 దరఖాస్తులు వచ్చాయి. ఇతర అంశాలపై 1,338 మంది దరఖాస్తు చేశారు. ఇందులో ఇందిరమ్మ ఇల్లు, ఆసరా పింఛన్లు, మహిళలకు నెలకు రూ.2,500 పథకాలపై స్పష్టత లేకపోగా ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ పథకాలు అందక పేదలు నిరాశకు గురవుతున్నారు.

జీరో బిల్లు రావడం లేదు..



నెలకు 150 యూనిట్ల లోపే విద్యుత్ వాడుతున్నా జీరో బిల్లు రావడం లేదు. కిరాయి ఇంటిలో ఉండటంతో యజమాని దరఖాస్తు చేసి ఉంటాడనుకున్నాం. కానీ, వాళ్లు చేయలేదు. మేం చేయక జీరో బిల్లు రావడం లేదు. మున్సిపాలిటీ, విద్యుత్ శాఖ ఆఫీస్‌కు వెళ్తే ఆన్‌లైన్‌లో పొందుపర్చలేదని చెబుతున్నారు.

–మీనావతి, 8వ వార్డు, ఇల్లెందు

రేషన్ కార్డు లేకపోవడంతో..



మాకు రేషన్ కార్డు లేదు. దీంతో ఉచిత విద్యుత్ పథకం అందలేదు. కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా అనుమతి రాలేదంటున్నారు. నాలుగు నెలలుగా బిల్లు వస్తుండటంతో చేసేదేం లేక బిల్లు చెల్లిస్తున్నాం. ఉచిత విద్యుత్‌కు అర్హులం అయినప్పటికీ పొందే అవకాశం లేకుండా పోయింది.

–సీహెచ్ కళావతి, 6వ వార్డు, ఇల్లెందు

అనుమతి రావాలి..



ఉచిత విద్యుత్ కోసం కొత్త వారి దరఖాస్తుకు అనుమతి రావాలి. ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు, మీటర్ నంబర్లలో తప్పిదాలు ఉంటే సవరణకు అవకాశం ఇచ్చారు. కానీ, అసలే దరఖాస్తు చేయని వారు ఉంటే ఇప్పుడు చేసుకునేలా అవకాశం ఇవ్వాల్సి ఉంది.

–అంకుషావలి, మున్సిపల్ మేనేజర్, ఇల్లెందు

పగిలిన పైపులైన్‌తో తాగునీటి కటకట



ట్యాంకుతో నీరు సరఫరా చేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: వారం రోజులుగా కొత్తగూడెం మున్సిపాలిటీలోని వార్డుల్లో కిన్నెరసాని కులాయిలు రాకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. లక్ష్మీదేవిపల్లిలోని ఫిల్టర్‌బెడ్‌లో పైపులైన్ పగిలిపోవడంతో పట్టణంలో నీటి సమస్య తలెత్తింది. వారం రోజులు అవుతున్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది మరమ్మతులు చేస్తుండటంతో నీటి సమస్య తలెత్తింది. పట్టణంలో దాదాపు 80 శాతం మంది ప్రజలు కిన్నెరసాని నీటిని వినియోగిస్తారు. ప్రస్తుతం నల్లాలు రాకపోవడం వల్ల వారంతా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బయట కొనుగోలు చేస్తున్నారు. అయితే, ఇంట్లో వాడకానికి కూడా నీరు లేకపోవడంతో ఇబ్బందులు పెరిగాయి. కొంతరు వార్డు కౌన్సిలర్లు చొరవ తీసుకుని ట్యాంకులను తెప్పించి సమస్యను తీర్చగలుగుతున్నారు. మిగతా వార్డుల్లోని ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం మధ్యాహ్నం కల్లా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి



ఇల్లెందు: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

ఇల్లెందు: బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణికి అప్పగించాలని, తద్వారా సంస్థను పరిరక్షించాలనే డిమాండ్‌తో చేపడుతున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు. ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి పరిరక్షణ కోసం సీపీఎం ఆధ్వర్యాన చేపట్టిన బస్సుయాత్ర సోమవారం మొదలు కాగా, వచ్చేనెల 5 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ యాత్ర ఇల్లెందుకు రానున్న సందర్భంగా ఆగస్టు 4న ఉదయం 10 గంటలకు కొత్త బస్టాండ్ వద్ద సభ ఉంటుందని చెప్పారు. సమావేశంలో నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, బ్రహ్మాచారి, నబీ, కృష్ణ, జైబున్నీసా, మోహన్‌రావు, సుల్తానా, వెంకటమ్మ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు విడుదల..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని నిరసిస్తూ సీపీఎం చేపట్టిన బస్సుయాత్రను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య కోరారు. యాత్ర వాల్‌పోస్టర్లను సోమవారం ఆయన కొత్తగూడెంలో విడుదల చేసి మాట్లాడారు. కాగా, యాత్ర ముగింపు సభ ఆగస్టు 5న కొత్తగూడెంలో జరగనుందని తెలిపారు. నాయకులు కె.బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, భూక్యా రమేశ్, డి.వీరన్న, ఎస్.లక్ష్మి, విజయగిరి శ్రీనివాస్, జి.రాజారావు, వై.వెంకటేశ్వరరావు, రమేశ్‌బాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కొత్తగూడెంఅర్బన్: మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక హనుమాన్‌బస్తీ రాజీవ్‌పార్కు ప్రాంతాల్లో యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డాగ్ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత జీవితంలో లక్ష్యాన్ని పెట్టుకొని, దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. చెడు అలవాట్లు, చెడు స్నేహితులకు దూరంగా ఉండాలన్నారు. చదువుతున్న పాఠశాల, కళాశాల, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చే విధంగా ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేశారు. కార్యక్రమంలో త్రీటౌన్ సిబ్బంది, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ డాగ్ టీం బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాల్సిందే..

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముఖ్యమంత్రి హరేరామ హరేకృష్ణ సంస్థ ప్రతినిధులతో చర్చించి సెంట్రలైజ్డ్ కిచెన్ విధానంతో కొడంగల్ ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని చెప్పడం రాష్ట్రంలో 5,400 పాఠశాలల వంట కార్మికుల జీవితాలపై దెబ్బకొట్టేందుకు సిద్ధమైనట్లేనని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ విమర్శించారు. శేషగిరిభవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 22 ఏళ్లుగా ఈ పథకం ద్వారా వంటలు చేస్తూ విద్యార్థులకు సొంత డబ్బులు పెట్టి పాఠశాలల్లో వంటలు చేస్తూ బిల్లులు వచ్చినపుడు తీసుకుని, నాణ్యమైన భోజనం అందిస్తున్న కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఏరికోరి తెచ్చుకున్న కాంగ్రెస్ కార్మికులకు వేతనాలు పెంచుతామన్న హామీని విస్మరించి హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా వంటలు చేయడానికి ప్రయత్నించడం అన్యాయమన్నారు.



మాట్లాడుతున్న నరాటి ప్రసాద్

ముఖ్యమంత్రి స్పందించి 54 వేల మంది వంట కార్మికులు రోడ్డున పడకుండా పునరాలోచన చేయాలని కోరారు. ఈ నెల 31వ తేదీన నిర్వహించే ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కంచర్ల జమలయ్య, నగేశ్, మల్లికార్జున్, విజయలక్ష్మి, ప్రభావతి, మంగ, పుష్పవతి పాల్గొన్నారు.

ఘనంగా పులుల సంరక్షణ దినోత్సవం



గొత్తికోయలతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు, పక్కన అటవీశాఖ సిబ్బంది

జూలూరుపాడు: అంతర్జాతీయ పులల సంరక్షణ దినోత్సవాన్ని సోమవారం జూలూరుపాడు అటవీశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గుండ్లరేవు గ్రామ పంచాయతీ ఎలుకలొడ్డు గ్రామ సమీపంలో నివసిస్తున్న గొత్తి కోయల నివాసాల వద్దకు ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు, సిబ్బంది వెళ్లి.. అడవి జంతువులను వేటాడటం నేరమని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మల్లయ్య, హనుమంతు, విజయలక్ష్మి, చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అడవిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

అడవిలోని చెట్లను నరికి ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎఫ్ఆర్ఓ ప్రసాద్‌రావు హెచ్చరించారు. సోమవారం జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధి వినోభానగర్ బీట్ చీమలపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లోని చెట్లను వినోభానగర్‌కు చెందిన అంగోత్ బాలకృష్ణ డోజర్‌తో చదును చేస్తున్నాడు. ఎఫ్ఎస్ఓ సలీం, బీట్ ఆఫీసర్లు రేఖ, వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి వెళ్లి పనులను అడ్డుకున్నారు. డోజర్‌ను ఎఫ్ఆర్ఓ కార్యాలయానికి తరలించారు. అంగోత్ బాలకృష్ణతోపాటు డోజర్ యజమాని బాదావత్ సురేశ్‌పై కేసు నమోదు చేశామని, కొత్తగా పోడు చేస్తే అటవీ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్ఓ హెచ్చరించారు.

బస్‌పాస్‌లతో దివ్యాంగులకు మేలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఎం దేవేందర్‌గౌడ్

టేకులపల్లి: ఆర్టీసీ జారీ చేసే బస్ పాస్‌లతో దివ్యాంగులకు మేలు జరుగుతుందని కొత్తగూడెం డిపో మేనేజర్ మలగం దేవేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు ఇచ్చేందుకు శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డీఎం మాట్లాడుతూ.. పాస్ కోసం జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ఇక్కడే జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ పాస్‌లతో ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల్లో రాష్ట్రమంతా 50 శాతం చార్జీతో ప్రయాణం చేయవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా 30 మందికి పాస్‌లు జారీ చేయగా, ఇంకా అర్హులు ఉంటే 90103 74644 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం టేకులపల్లిలోని కార్గో (లాజిస్టిక్) సెంటర్‌ను సందర్శించి తనిఖీ చేశారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులు, వ్యాపారులతో మాట్లాడారు. బస్‌పాస్‌ల ఇన్‌చార్జ్ ఇసనపల్లి శామ్యూల్, శ్రావణ్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు



టేకులపల్లి: మొక్క నాటుతున్న ఇల్లెందు జీఎం జాన్‌ఆనంద్

టేకులపల్లి: సింగరేణి సీఎండీ ఎన్.బలరాం పుట్టినరోజు సందర్భంగా ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం సోమవారం సింగరేణి హైటెక్‌కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సౌరబ్ సుమన్, శివశంకర్, హరినారాయణ, కృష్ణ, వెంకటేశ్వర్లు, నజీర్ అహ్మద్, జె.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన నాయకులు

కొత్తగూడెంరూరల్: సింగరేణి సీఎండీ బలరామ్ పుట్టినరోజు సందర్భంగా పలువురు నాయకులు కలిసి శుభకాంక్షలు తెలిపారు. టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు ఆయనను కలిసి మొక్క అందజేసి మాట్లాడారు. అలాగే, బలరామ్, ఇన్‌కమ్ టాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ జన్మదినం సందర్భంగా పలుచోట్ల వివిధ సంఘాల నాయకులు మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో లాల్‌సింగ్‌నాయక్, రజాక్, భూక్యా రుక్మిణి, భద్రం, శ్రీకాంత్, బోదను కనకరాజు, హలావత్ రుక్మిణి, రంజిత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధారామంలో..

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీ బలరాం పుట్టినరోజు సందర్భంగా సోమవారం కారుకొండ రామవరం బౌద్ధారామంలో 116 గంధం మొక్కలు నాటారు. అంతోటి నాగేశ్వరరావు, అందెల ఆనందరావు, కొచ్చెర్ల కమలారాణి, మాలకొండయ్య, కలవల చంద్రశేఖర్‌రావు, జిమ్మిడి మల్లేశ్, మైల రాజేశ్వరరావు, విజేందర్, రమేశ్, మనీశ్ విక్టర్, గణేశ్, శ్రీహరి, బిక్కులాల్, సుమన్, రాజు, మధుకృష్ణ పాల్గొన్నారు.